క్లుప్తంగా

జ్యోతిర్లింగాలకు మహా పడిపూజ



పడిపూజ చేస్తున్న శివ భక్తులు

ధారూరు: శ్రీవీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో గురువారం శివ భక్తులు జ్యోతిర్లింగాలకు మహా పడిపూజ చేశారు. పూజా కార్యక్రమాలను పూజారీ చెన్నబసవయ్యస్వామి నిర్వహించి, భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. అనంతరం శివ భక్తులు దీక్ష విరమించేందుకు శ్రీశైలం మల్లికార్జునిడి చెంతకు ఇరుముడితో బయల్దేరారు.

కపిలేశ్వరుడికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న శివ భక్తులు

ధారూరు: శ్రీవీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో ప్రథమ పూజ్యుడు మహా గణపతికి గురువారం శివభక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కపిలేశ్వరస్వామికి జలాభిషేకం, పాలాభిషేకం నిర్వహించారు. పార్వతీమాత, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీవీరభద్రేశ్వరస్వామి, నాగదేవత, నందీశ్వరస్వామి, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. పూజారి చెన్న బసవయ్యస్వామి భక్తులకు హారతి ఇచ్చి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గాలికుంటు వ్యాధిని నిర్మూలిద్దాం



బూర్గుపల్లిలో పశువులకు టీకా ఇస్తున్న వైద్యుడు శివ

మోమిన్‌పేట: గాలికుంటు వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని పశు వైద్యాధికారి శివ అన్నారు. మండల పరిధి బూర్గుపల్లి, ఎన్కేపల్లి గ్రామాల్లో గురువారం పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పశువులకు ముందస్తుగా టీకాలు వేయిస్తే.. వ్యాధి సోకదన్నారు. ఆలస్యం చేస్తే ఆవులు, బర్రెలు రోగాల బారిన పడి, అవి పాలు ఇవ్వవని చెప్పారు. తద్వారా రైతులు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న టీకాలను.. వైద్యులు గ్రామాల్లోకి వచ్చి పశువులకు ఇస్తున్నారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: మండల పరిధి మల్కాపూర్ గ్రామంలో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను గురువారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో శ్మశానవాటిక నుంచి హనుమాన్ ఆలయం వరకు కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించరాదని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయిన నర్సింహులు, గంజీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'మా వారసులకు ఉత్తర్వులు ఇవ్వండి'



తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఎలు

బంట్వారం: జీఓ నంబర్ 81, 85 ప్రకారం 61 సంవత్సరాలు పై బడిన వీఆర్‌ఎల వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని వీఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షుడు అంజిలయ్య కోరారు. ఈ మేరకు ఆయన గురువారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. వయసు పై బడిన గ్రామ రెవెన్యూ సహాయ అధికారులు రాష్ట్రంలో 3,797 మంది ఉన్నారని, వీరి స్థానంలో వారసులను నియమించాలన్నారు. ఏడు నెలలు గడుస్తున్నా.. వారసులకు ఆర్డర్ కాపీలు అందలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బడిలో.. 'బాలసభ'

- మాక్ పోలింగ్ ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థులు
- ఎన్నికల నిర్వహణపై బాలబాలికలకు అవగాహన



ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థులు



ఓటు వేస్తున్న విద్యార్థి

కుల్కచర్ల: ఎన్నికల ప్రక్రియను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపేందుకు మ్యాజిక్ స్వచ్ఛంద సంస్థ 'బాలసభ' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గురువారం మండల పరిధి ముజాహిద్‌పూర్‌లోని జెడ్పీ పాఠశాలలో ఒక ప్రజాప్రతినిధిని ఎలా ఎన్నుకుంటారు? పోలింగ్ ప్రక్రియ తదితర అంశాల్లో విద్యార్థులను ప్రత్యక్ష భాగస్వాములను చేసి, అవగాహన కల్పించారు. ఎన్నిక ప్రక్రియలో ఎన్‌సీసీ విద్యార్థులు పోలీసు సిబ్బందిగా, మరి కొందరు నాయకులుగా వ్యవహరించారు. విద్యార్థులతో పాటుగా ఉపాధ్యాయులు సైతం ఓటు వేసి, బాలబాలికలకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు, సీఆర్పీ రాజు, శ్రీనివాస్, ఉపాధ్యాయుడు వెంకట్, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శిల్ప

- సమాజం గురించి తెలుసుకోవాలి
- జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శిల్ప

పరిగి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పరిగి సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప సూచించారు. గురువారం పట్టణ కేంద్రంలోని పల్లవి కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు, మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు, చట్టాలను చదివి అవగాహన పెంపొందించుకోవాలని, అది యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. సమాజంలో మనం ఎలా మెలగాలి, మన కర్తవ్యం ఏమిటనేది తెలుస్తుందని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అందుకు ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో వంటింటికే పరిమితం అయిన ఆడవారు.. ప్రస్తుతం ప్రపంచాన్ని శాసించే స్థాయిలో ఉన్నారని వివరించారు. సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సంతోష్, న్యాయవాదులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచండి



విద్యార్థులతో బోర్డుపై రాయించి, పరిశీలిస్తున్న నోడల్ అధికారి వెంకట్

దోమ: విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి వెంకట్ సూచించారు. గురువారం మండల పరిధి కుమ్మరికుంట తండా ప్రాథమిక పాఠశాలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యనాయక్‌తో కలిసి సందర్శించారు. తొలుత పాఠశాల పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని చెప్పారు. ముఖ్యంగా తెలుగు, ఇంగ్లిష్, గణితం పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. అనంతరం ఎఫ్‌ఎల్‌ఎన్ వర్క్ షీట్స్‌ను పరిశీలించి, విద్యార్థులతో చదివించారు. ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలను చూసి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవి, సీఆర్పీ రెడ్యానాయక్, ఉపాధ్యాయురాలు భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీరు వృథా



వృథాగా పోతున్న తాగునీరు

మర్పల్లి: మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి, తాగు నీరు వృథాగా పోతుందని గురువారం కొందరు స్థానికులు చెప్పారు. మార్కెట్ కమాన్ ఎదుట రోడ్డు పక్కన ఉన్న పైపులైన్ నుంచి కొద్ది రోజులుగా నీరు లీకవుతుందని తెలిపారు. విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని, పైపులైన్‌కు మరమ్మతు చేపట్టి, నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

ఆరోగ్యంతోనే ఏకాగ్రత సాధ్యం

- విద్యార్థినులు చదువుతో పాటు.. అన్ని రంగాల్లో రాణించాలి
- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



తాండూరు టౌన్: విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ, ఏకాగ్రత పెరుగుతుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణ శివారులోని తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో గంగా అరుణ ఫౌండేషన్, డెక్కన్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికల్లో రక్తహీనత సమస్యలు ఉంటాయని, వాటిని అధిగమించేందుకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. చదువుతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో విద్యార్థినులకు రుచికరమైన, పోషకాలతో కూడిన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్న ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న, బాలేశ్వర్ గుప్తా, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్



యాలాల: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: కాంగ్రెస్ పార్టీలో అగ్గనూరు మాజీ సర్పంచ్ పినమోని భీమప్ప చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కోలుకుంది హన్మంతు, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు సొంత భవనం నిర్మించాలి



పరిగి: ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి అధ్యాపకుల వినతి

పరిగి: పరిగికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరై రెండేళ్లు అయినా.. సొంత భవనం లేక ఇబ్బంది పడుతున్నామని, వెంటనే భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డికి గురువారం కళాశాల అధ్యాపకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కళాశాల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ డేవిడ్‌విల్సన్, అధ్యాపకులు గంగాధర్, సంపత్‌కుమార్, జనార్దన్, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి అండగా ఉంటాం

కుల్కచర్ల: ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తమవంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. మండలానికి చెందిన వీరశైవలింగాయత్ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిశారు. కుల్కచర్లలో నిర్మిస్తున్న శివాలయ ప్రహరీ నిర్మాణానికి ఆర్థిక సహాయం కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మాట్లాడారు. ఆలయాల అభివృద్ధికి అండగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆనందం, సంఘం నాయకులు అంగడి శివరాజ్, రవిచందర్, చంద్రశేఖర్, రాజేశ్వర్, వినోద్ కుమార్, సంగప్ప, వీరేష్, ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటం

వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీను నాయక్



సభ్యత్వ నమోదు పత్రాలను అందజేస్తున్న శ్రీను నాయక్

షాద్‌నగర్: కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీను నాయక్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీను నాయక్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేఖ విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ప్రభుత్వం కొలతలు లేకుండా రోజుకు రూ.600వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 200వందల రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను సమకూర్చాలన్నారు. పెండింగ్ కూలీ డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాములమ్మ, హంసమ్మ, జానమ్మ, పార్వతమ్మ, యాదమ్మ, సునీత, సరిత, జయమ్మ, లక్ష్మమ్మ, పద్మ, అంజమ్మ, అమృతమ్మ, రాజేశ్వరీ, సుగుణమ్మ, నర్సమ్మ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన విద్యకు ప్రోత్సాహం

కేఎల్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ

మొయినాబాద్ రూరల్: పరిశోధన విద్యలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేఎల్ యూనివర్సిటీ ముందుంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ ఆకెళ్ల పేర్కొన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా అజీజ్‌నగర్ సమీపంలోని కేఎల్ యూనివర్సిటీలో విజ్ఞానం, వనరుల మార్పిడిలో వ్యూహాత్మక భాగస్వామ్యంతో ఈ కళాశాలలో టెక్నాలజీ డెటాబెస్ మెనేజ్‌మెంట్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ చేసేందుకు ఆవిష్కరణ, పరిశోధనలకు మోంగోడిబి ఇండియాతో ఒప్పందం చేసుకున్నారు. మేనేజర్ బసవదర్శన్, యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఎంఓయూపై సంతకాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధకుల కోసం ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ఎంతో మేలైందన్నారు. సాంకేతిక పరిశ్రమల్లో ప్రముఖ సంస్థ మోంగోడిబి ఇండియాతో భాగస్వామ్యం చేసుకోవడం వలన డేటాబేస్, మేనేజ్‌మెంట్ అప్లికేషన్, డెవలప్‌మెంట్, డైనమిక్ రంగాల్లో రాణించడానికి విద్యార్థులకు ఒక వేదికను సృష్టిస్తున్నామని తెలిపారు.

ఉన్నత విద్యపై అవగాహన

కొడంగల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించారు. గురువారం కళాశాల ఆవరణలో ఓరియంటేషన్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఇందులో డిగ్రీ తరువాత ఉన్నత విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డేవిడ్ విల్సన్, వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానం, అకాడమిక్ కో ఆర్డినేటర్ రాంబాబు, డాక్టర్ రమేష్‌బాబు, అన్నపూర్ణ, హరిప్రియ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆబ్కారీ సీఐగా వెంకటేశ్వర్లు

కొడంగల్: కొడంగల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్(ఆబ్కారీ) సీఐగా వెంకటేశ్వర్లు గురువారం విధుల్లో చేరారు. దేవరకొండ నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన సైదులు.. నల్లగొండ జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు బదిలీపై వెళ్లారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ



సీఐ శ్రీధర్‌రెడ్డి

కొడంగల్: కొడంగల్ సీఐగా శ్రీధర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన రాములు హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. శ్రీధర్‌రెడ్డి సంగారెడ్డి జిల్లా కేంద్రంలో విధులు నిర్వహించేవారు. అక్కడి నుంచి ఆయనను కొడంగల్‌కు బదిలీ చేశారు.

నూతన కమిటీ నియామకం



అధ్యక్షుడు బాల్‌రెడ్డి

తాండూరు టౌన్: తాండూరు గోశాల అధ్యక్షుడిగా పట్లోళ్ల బాల్‌రెడ్డి గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శిగా కోట్రిక కిరణ్, కోశాధికారిగా మన్మోహన్ సార్దాను నియమించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బాధ్యతలు స్వీకరించనున్న నూతన కమిటీ.. రెండేళ్ల పాటు పని చేయనుంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బాల్‌రెడ్డి మాట్లాడారు. సనాతన ధర్మ పరిరక్షణకు, గో సంరక్షణకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో గోశాల ప్రతినిధులు వేణుగోపాల్ రెడ్డి, పటేల్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

లైట్లు ఏర్పాటు చేయండి

కొత్తూరు: మండల కేంద్రం సమీపంలోని వై జంక్షన్ కూడలి నుంచి జేపీదర్గా వరకు బైపాస్ మధ్యలో బటర్‌ఫ్లై ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేయాలని గురువారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు చారీ కోరారు. దీపాలు లేని కారణంగా రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సమస్యను పలుమార్లు ఎన్‌హెచ్‌ఏఐ, సంబంధిత అధికారుల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

వీరశైవులను ఓబీసీలో చేర్చేందుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరప్ప

తాండూరు టౌన్: వీరశైవులను ఓబీసీలో చేర్చేందుకు కృషి చేస్తానని వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెన్నె ఈశ్వరప్ప అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరశైవులకు కులవృత్తంటూ లేదని, అన్ని విధాలా వెనుకబడి ఉన్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వీరశైవుల సమస్యలను వివరించి, ఓబీసీ సాధించే వరకు సంఘటితంగా ఉండాలని కోరారు. అనంతరం ఈశ్వరప్పను తాండూరు వీరశైవ సమాజం, వీరశైవ లింగాయత్, లింగ బలిజ సమాజం అధ్యక్షులు పటేల్ ఉదయ్‌కుమార్, శంకర్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గాజుల శాంత్‌కుమార్, పటేల్ విజయ్, సిద్ధిలింగం, శంకర్, చెన్‌బసప్ప, శివకుమార్, ప్రకాష్, బస్వరాజ్, మల్లికార్జున్, బాలి శివకుమార్, శరణు, బసనప్ప తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి



ఇంటి పన్ను వసూలు చేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని మండల ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ తాగునీటి నల్లాల పరిశీలనతో పాటు ఇంటి పన్నుల వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు నీటి సమస్య రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిన ఆదేశించారు. నీటి సమస్యలు రాకుండా గ్రామ పంచాయతీ అధికారి, సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలను అడిగి తెలుసుకోవాలన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా వెంటనే పరిష్కరించాలన్నారు. మండలంలో 65 శాతం ఇంటి పన్నులు వసూలు అయిందని తెలిపారు. వంద శాతం పూర్తి చేసేందుకు జీపీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి రంజిత్‌కుమార్, బిల్ కలెక్టర్ శ్రావణ్‌కుమార్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీఎస్పీదే విజయం

బీఎస్పీ రాష్ట్ర కమిటీ నాయకుడు విజయార్యక్షత్రియ



మాట్లాడుతున్న విజయార్యక్షత్రియ

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీదే విజయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు విజయార్య క్షత్రియ ఆశాభావం వ్యక్తంచేశారు. రంగారెడ్డి చేవెళ్ల అసెంబ్లీ కార్యాలయంలో గురువారం అసెంబ్లీ అధ్యక్షుడు జి.చందు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు కమిటీల అధ్యక్షులను నియమించి, వారికి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. రెండు సంవత్సరాలుగా పార్టీకోసం పనిచేస్తున్న మల్లి వెంకటేశ్‌ను చేవెళ్ల అసెంబ్లీ ఉపాధ్యక్షుడిగా, ఆలూరు గ్రామానికి చెందిన మొకురం కుమార్‌ను ప్రధాన కార్యదర్శిగా, మండల అధ్యక్షుడిగా ఆలూరు గ్రామానికి చెందిన మోకురం రాజులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అసెంబ్లీ అధ్యక్షుడు చందు మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసేవారిని పార్టీ గుర్తిస్తుందని పేర్కొన్నారు. పార్టీ నిర్మాణంలో, బలోపేతానికి అందరం కలిసి పనిచేయాలని సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం!

కొత్తూరు: మండల పరిధి ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఎస్సీ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు ప్రక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు తక్కువ ఎత్తులో ఉండడంతో తీగలు వేలాడుతున్నాయని తెలిపారు. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని చెప్పారు. ఇప్పటికే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మేకలు, పశువులు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి, కంచె ఏర్పాటు చేయాలని వారు గ్రామస్తులు కోరారు.